క్లుప్తంగా

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోండి


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్సై కోటయ్య

పీసీపల్లి: విద్యార్థులు బాల్య దశ నుంచే కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని ఎస్సై జి.కోటయ్య అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుకి విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలేజీకి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు ఎటువంటి చెడు వ్యసనాలకు బానిస కాకూడదన్నారు. ప్రిన్సిపాల్ విజయ శంకర్, ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్ఎం ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ శివకుమారి

కొండపి: స్థానిక టంగుటూరు రోడ్డులో ఉన్న మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ సీఐ శివకుమారి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె షాపులోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మద్యం అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్టుషాపుల వారికి మద్యం అమ్మినా చర్యలు తప్పవన్నారు. మద్యం దుకాణాల్లో ధరలను బోర్డులపై ఉంచాలన్నారు. మద్యం అమ్మకాల్లో ఎటువంటి అక్రమాలు జరిగినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థాన భూముల్లో ఆక్రమణల తొలగింపు


ఆక్రమమణలను జేసీబీతో తొలగిస్తున్న ఎండోమెంట్ సిబ్బంది

పామూరు: దేవస్థాన భూములను ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు చేపడతామని మదన వేణుగోపాలస్వామి, వల్లీభుజంగేశ్వరస్వామి ఆలయ ఈఓ ఎస్‌జిఆర్.నరసింహబాబు అన్నారు. పామూరు నెల్లూరురోడ్డులో ఆక్రమణకు గురైన ఆలయభూమి సర్వేనంబర్ 329/2 ఆక్రమణలను జేసీబీల సాయంతో తొలగించారు. ఆలయ భూములను ఆక్రమిస్తే కేసు నమోదుకు సిఫార్సు చేయనున్నట్లు ఈఓ, సిబ్బంది తెలిపారు.

సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాల పరిశీలన


వ్యవసాయ పనిముట్లను పరిశీలిస్తున్న అధికారులు

కొండపి: మండలంలోని నేతివారిపాలెం, కట్లవారిపాలెం, కొండపి గ్రామాల్లో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ గ్రూపులకు సబ్సిడీపై ఇచ్చిన వ్యవసాయ యంత్ర పరికరాలను ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకుడు రమేష్ బాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రూపులకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించి వ్యవసాయ పనిముట్ల అద్దె వివరాలను, రుణ వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. గ్రూపు ద్వారా సబ్సిడీపై పొందిన యంత్రాల ద్వారా సన్న, చిన్న కారు రైతులకు అందించాలన్నారు. వ్యవసాయాధికారి డి.విజయ్ కుమార్, విస్తరణ అధికారి కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీను, రమ్య, వెంకటనారాయణ, భరత్, రైతులు పాల్గొన్నారు.

గణిత దినోత్సవ పోటీల్లో సత్తా


విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

సీఎస్‌పురం(పామూరు): గణిత దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో వెలిగండ్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన పోటీల్లో సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థిని బి.సహస్రలక్ష్మి సత్తా చాటింది. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఖాదరున్నీసాబేగం, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. విద్యార్థులు సహస్రలక్ష్మిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

గత ఏడాది పొగాకు సాగులో సిరులు పండించిన రైతులకు ఈ ఏడాది కష్టాలు మొదలయ్యాయి. మండలంలో క్యూరింగ్ చేస్తున్న పొగాకులో అధిక శాతం లో గ్రేడ్ దిగుబడి వస్తుండటంతో పొగాకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది భారీగా పెరిగిన పెట్టుబడి ఖర్చులకు ఈ లో గ్రేడ్ దిగుబడి చూస్తుంటే కనీసం భారీ నష్టాలు తప్పేలా లేవని రైతులు మదనపడుతున్నారు.

పొగాకు రైతుకు లోగ్రేడ్ టెన్షన్..!


మర్రిపూడిలో పొగాకు అల్లుతున్న కూలీలు

- క్యూరింగ్‌లో అధిక శాతం లో గ్రేడ్ దిగుబడి
- ఆందోళన చెందుతున్న పొగాకు రైతులు
- గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరిగిన పెట్టుబడులు

మర్రిపూడి:

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొగాకు రైతులకు స్వర్ణయుగమే. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆల్‌టైం ధరలు


క్యూరింగ్ అనంతరం వచ్చిన లో గ్రేడ్ దిగుబడి

పొగాకు రైతులకు దక్కాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సైతం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించడంతో వ్యాపారులు సైతం పోటా పోటీగా కొనుగోలు చేయడంతో ఊహించని ధరలు దక్కాయి. దీంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది.

వెయ్యి హెక్టార్లలో సాగు..

మండలంలో ప్రధాన వాణిజ్య పంటగా అధికశాతం పొగాకు పంట సాగుచేయడం అలవాటుగా మారింది. ఈ ఏడాది రబీలో అత్యధికంగా వెయ్యి హెక్టార్లల్లో పొగాకు సాగు చేపట్టారు. . మండలంలో 2200 పైగా లైసెన్స్ బ్యారన్‌లు ఉన్నాయి. గత ఏడాది మండలంలో 7వేల హెక్టారుల్లో పొగాకు సాగుచేయగా, ఈ ఏడాది 1000 హెక్టారుల్లో సాగు చేపట్టారు. ఇప్పటికే ముదురు పొగాకు సాగు చేపట్టిన రైతులు ఆకు రెలిపి క్యూరింగ్ చేపట్టారు. బ్యారన్‌లో క్యూరింగ్ అనంతరం ఏగ్రేడ్ రంగు రాలేదు. అధికంగా లోగ్రేడ్(మాడు) ఆకు దిగుబడి వచ్చింది. పెట్టిన పెట్టుబడులు సైతం రావేమోనని రైతులు ఆందోళణ చెందుతున్నారు.

పెరిగిన పెట్టుబడులు

ఈ ఏడాది రబీసాగు ప్రారంభం నుండే వర్షాలు మొదలయ్యాయి. దీంతో పొగనారు మూట ధర అమాంతం రూ. 4 వేలకు పెరిగింది. గత ఏడాది పొగాకు కూలీలకు ఒక్కక్కరికి రోజుకు రూ. 350లు ఉండగా, ఈ ఏడాది రూ.500లకు పెరిగింది. గత ఏడాది బ్యారన్ కౌలు రూ.1.20 లక్షలు ఉండగా, ఈ ఏడాది రూ.2.25లక్షలకు పెరిగింది. పచ్చాకు పనిచేసే భార్యభర్తల కూలీ బ్యారన్‌కు గతేడాది రూ. 1.40లక్షలు కాగా, ఈ ఏడాది రూ. 1.60లకు పెరిగింది. బ్యారన్ క్యూరింగ్ చేసే డ్రైవర్‌కు గత ఏడాది రూ. 40 వేలు ఉండగా, ఈ ఏడాది రూ.60 వేలకు పెంచేశారు. దానికితోడు పొలం కౌలు, బలంమందు, సేద్యాలు రెండింతలు పెరిగాయి. ఈ ఏడాది పెట్టిన పెట్టుబడులు కూడా రావని రైతులు ఆందోళణ చెందుతున్నారు.

పెట్టుబడులు పెరిగిపోయాయి.



గత ప్రభుత్వంలో పొగాకు సాగు చేపట్టి చేసిన అప్పులు తీర్చుకోగలిగాం. ఈ ఏడాది పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి. ఆకు రెలిపేందుకు ముఠాకు గత ప్రభుత్వం రూ.30 వేలు ఇచ్చాం. ఈ ఏడాది ఒకే సారి రూ.40 వేలకు పెరిగింది. అయినా క్యూరింగ్ అనంతరం మాడాకు దిగుబడి వచ్చింది. గత ప్రభుత్వంలో పొగాకు క్వింటా ధర రూ. 36వేలు పలికింది. మరీ ఈ ఏడాది పొగాకు రేట్లు ఏ విధంగా ఉంటాయో వేచి చూడాలి మరి. ఆకు దిగుబడిని చూస్తే ఈ ఏడాది రైతులకు నష్టాలే మిగులుతాయి.

గంగిరెడ్డి రమణారెడ్డి
దర్శవరం రైతు.

11 ఎకరాలు పొగాకు సాగుచేశా:



నేను 11 ఎకరాలల్లో పొగాకు సాగుచేశాను. ముందుగా సాగు చేపట్టిన ముదురు పొగాకు రెలిపి బ్యారన్‌లో పెట్టి క్యూరింగ్ చేపట్టాం. 90 శాతం లోగ్రేడ్ పొగాకు దిగుబడి వచ్చింది. మాడు ఆకు ఎక్కువగా వచ్చింది. కనీసం కూలీల ఖర్చులు కూడా వచ్చేటట్లు లేవు. ఈ ఏడాది పొగాకు సాగు రైతులను నట్టేట ముంచింది.

పల్లకి నవీన్‌రెడ్డి రైతు మర్రిపూడి.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు

సీఎస్‌పురం(పామూరు): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని, రైతులను ఆదుకోవాలని ఎంపీటీసీలు మితికెల ప్రభావతి, జాజుల తిరుపాలు, పాతర లలితమ్మ సమావేశం దృష్టికి తీసుకురాగా ఎంపీపీ మాట్లాడుతూ పంట దెబ్బతిన్న పంటలన్నింటికీ పరిహారం వచ్చేలా చూడాలని ఏఓ సంపత్‌కుమార్‌కు సూచించారు. పంటనష్టాన్ని అంచనావేసి నివేదికలు పంపామని, అర్హులకు పరిహారం అందుతుందని ఏఓ తెలిపారు. పంచాయతీ తీర్మానం ఇచ్చిన తరువాతే ఉపాధి పనులు ప్రారంభించాలని కోవిలంపాడు సర్పంచ్ ఖాదర్‌బీబుజ్జి ఏపీఓకు సూచించగా.ఎంపీపీ మాట్లాడుతూ తీర్మానం ఇచ్చిన తరువాతే పనులు ప్రారంభించాలని, జాబ్‌కార్డులు ఉన్నవారందరికీ పనులు కల్పించాలని ఏపీఓ వాక్యవతికి సూచించారు. వి.బైలు సర్పంచ్ వెంగళరావు మాట్లాడుతూ 10 నెలల క్రితం నూతన ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు డీడీలు తీశారని, ఇప్పటికీ నూతన ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేయలేదని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలపగా సమస్య పరిష్కరిస్తామన్నారు. బోయమడుగుల సర్పంచ్ బొట్లా చిరంజీవి మాట్లాడుతూ త్రీఫేస్ విద్యుత్‌లైన్ కనెక్షన్ తక్షణం ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. పలువురు ఎంపీటీసీ, సర్పంచ్‌లు తాగునీటి ఇక్కట్లపై ప్రశ్నించగా రక్షిత మంచినీరు ఇచ్చేందుకు మండల పరిషత్‌నిధులు రు.24 లక్షలతో మొదటగా గుంతచెన్నంపల్లి, వెంకటాయచెరువు, చెన్నపునాయునిపల్లె గ్రామాల్లో ఆర్వోప్లాంటు పెడుతున్నట్లు ఎంపీపీ తెలిపారు. అగ్రహారం సర్పంచ్ చీర్లదిన్నె రాధ, బోయమడుగుల సర్పంచ్ చిరంజీవి, కోవిలంపాడు సర్పంచ్ ఖాదర్‌బీబుజ్జిలు గత అక్టోబర్ నుంచి మండలానికి ఈఓపీఆర్‌డీ లేరని, దీంతో బిల్లులు నిలిచిపోయాయని పనులు చేయాలంటే నిధులు లేవని తక్షణం ఈఓపీఆర్‌డీ పోస్టును భర్తీ చేయాలని కోరగా..రెండు రోజుల్లో నియమిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ మంచికంటి రంగసుబ్బరాయుడు, డిప్యూటీ తహసీల్దార్ పి.వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ పఠాన్ మహబు, వి.బ్రహ్మానందరెడ్డి, ఏఓ సంపత్‌కుమార్, డాక్టర్ మునీర్, డాక్టర్ మహేష్, ఏపీఓ వాక్యవతి, ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, ఏపీఎం లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఏఈ వినయ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృపావరం, హౌసింగ్ ఏఈ ఎస్ హరికృష్ణ, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

సీఎస్‌పురం(పామూరు): భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి తెలిపారు. మండలంలోని కోవిలంపాడులో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆన్‌లైన్‌కోసం, సర్వేకోసం, సవరణల కోసం అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బుజ్జి, అమడసాని బాలకేశవరెడ్డి, షేక్.నాయబ్‌రసూల్, షేక్.రజ్జబ్‌బాషా, సయ్యద్ దౌలత్‌ఖాన్, మోహన్‌రెడ్డి, పాలపర్తి నారాయణరావు, ఎండోమెంట్ సిబ్బంది డోలా శ్రీనివాసులు, సర్వేయర్ జీవిత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలంలోని కోటతిప్పలలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 12 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. సదస్సులో భూమి ఆన్‌లైన్ చేయాలని 10, ఇతర సమస్యలపై 2 అర్జీలు వచ్చాయన్నారు. సర్వేయర్ కె.రమణయ్య, వీఆర్‌ఓ గురుస్వామి, సచివాలయ సర్వేయర్ లక్ష్మీణారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్ అందజేత

కొండపి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ సెంటర్లో ఉత్తీర్ణత సాధించిన వారికి శనివారం సర్టిఫికెట్స్ అందజేసినట్లు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ గోపికృష్ణ తెలిపారు. తహసీల్దార్ పి.మురళి, ఎస్సై ప్రేమ్‌కుమార్, ఎంఈఓ రామారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వర్లు, రామయ్య చౌదరి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కలెక్టర్‌కు వినతి పత్రం అందచేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కనిగిరికి వచ్చిన కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ప్రజాప్రతినిధులు, ప్రజలు వివిధ సమస్యలను శనివారం విన్నవించారు. కనిగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, డయాలసిస్ కేంద్రం నూతన భవనం మంజూరు చేయాలని, పోస్టుమార్టం గది నిర్మించాలని, 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసి, వైద్యులు, వైద్య సిబ్బందిని కేటాయించాలని, తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందచేశారు. మోడల్ స్కూల్‌లోని సమస్యలు పరిష్కరించాలని పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పందిటి మోహన్ శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి ప్రతం అందచేశారు.

డ్రాపౌట్స్‌ను గుర్తించండి

మర్రిపూడి: గ్రామాల్లో డ్రాపౌట్స్‌ను గుర్తించి వారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఎంఈఓ ఎంవీ రంగయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. డాక్టర్ వీరబాబు మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. సూపర్‌వైజర్ సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కొండపి: కిశోరి వికాసంతో బాలిక భవిష్యత్‌కు పునాది వేస్తుందని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కిషోరి వికాసం కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. సీడీపీఓ మాధవిలత, పెట్లూరు వైద్యురాలు అనూష, ఏపీఎం గోపీనాథ్, ఎంఈఓ 2 రామారావు, సూపర్‌వైజర్ విక్టోరియా రాణి తదితరులు పాల్గొన్నారు.

నన్ను వేధిస్తున్నారు.. న్యాయం చేయండి


స్థలంలో నిరాహార దీక్ష చేస్తున్న పద్మావతి

ఒంగోలు టాస్క్‌ఫోర్స్: న్యాయంగా కొనుగోలు చేసిన స్థలాన్ని అమ్ముకోనీయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధిత మహిళ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం స్థలంలోనే నిరాహార దీక్ష చేపట్టింది. బాధిత మహిళ కథనం ప్రకారం..స్థానిక మార్కెట్ సెంటర్‌లో స్థలం కొనుగోలు చేయగా.. ఆ స్థలాన్ని అమ్ముకోనీయకుండా కొంతమంది ముస్లింలు, ఇద్దరు జర్నలిస్టులు ఇబ్బందులు గురిచేస్తున్నారని వాపోయింది. శుక్రవారం కొందరు ముస్లింలు పెద్ద మసీదు బజారులో 23 అడుగుల రోడ్డు ఉండాలని, కానీ పద్మావతి అనే మహిళ రోడ్డు ఆక్రమించడంతో పాటు రామతీర్థం వాటర్ పైపులైను ధ్వంసం చేసి ప్లాట్లుగా అమ్ముతుందని తహశీల్దార్, ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. అయితే పద్మావతి మాత్రం తాను ఒక్క సెంటు కూడా ఆక్రమించుకోలేదని, ఎటువంటి పైప్‌లైన్ ధ్వంసం చేయలేదని, డాక్యుమెంట్ ప్రకారం 14 అడుగుల రోడ్డు ఉందని, కానీ కొంత మంది ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడుతున్నారని వాపోయింది, న్యాయం కావాలని కోరుతూ తన స్థలంలో శనివారం సాయంత్రం టెంటు వేసి నిరాహారదీక్ష చేపట్టింది. దీంతో సర్వేయర్ బ్రహ్మం, గ్రామసర్వేయర్లు వచ్చి పెద్ద మసీదు రోడ్డుకు సంబంధించి ఎన్ని అడుగులు ఉండాలో తమ రికార్డు లేదని పంచాయతీ కార్యాలయంలో పరిశీలిస్తామని వెళ్లారు.

పాఠశాలల అభివృద్ధిలో కమిటీలదే కీలకపాత్ర


మాట్లాడుతున్న ఎంఈఓ రాజాల కొండారెడ్డి

సీఎస్‌పురం(పామూరు): పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీలది కీలపాత్ర అని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత మొత్తం 64 పాఠశాలల్లో శనివారం ఎస్ఎంసీ కమిటీకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పెదరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ శిక్షణలో ఎంఈఓ కొండారెడ్డి పాల్గొన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో బడిఈడు పిల్లలందరినీ పాఠశాలకు వచ్చేలా చూడటం, హాజరుశాతం పెంపు, పాఠశాల అభివృద్ధిలో నిధుల వినియోగం, విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, ×సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర । కిట్ల పంపిణీతో పాటు పాఠశాల అభివృద్ధికి సంబంధించి ప్రతి దానిలో కమిటీ చైర్మన్‌లు, సభ్యులు భాగస్వాములై పర్యవేక్షించాలన్నారు.

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు రమణయ్య, పెద్దిరాజు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీలు పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. హెచ్ఎంలు బి.సుబ్బారావు,శ్రీనివాసరావు, పద్మావతి, పాల్గొన్నారు.

సింగరాయకొండ: పాఠశాల అభివృద్ధికి పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు సహకరించాలని ప్రధానోపాధ్యాయుడు బీసాబత్తిన శ్రీనివాసరావు అన్నారు. బింగినపల్లి వైసీ ప్రాథమిక పాఠశాలలో శనివారం పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కేశవరపు జాలిరెడ్డి, పాఠశాల చైర్మన్ అనూరాధ, వైస్ చైర్మన్ మాలాశ్రీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం


కొండపిలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ మురళి


సింగరాయకొండ: విద్యార్థులకు భోజనం పంపిణీ చేస్తున్న దృశ్యం

కొండపి: మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ పి.మురళి శనివారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ మధ్యాహ్న భోజనం పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, ఎస్సై ప్రేమ్‌కుమార్, ఎంఈఓ- 2 రామారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య పాల్గొన్నారు.

పామూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని మధ్యాహ్న భోజన పథకాన్ని ఉపయోగించుకోవాలని సీఐ భీమా నాయక్, ఎస్సై టి.కిషోర్‌బాబు, ఎంఈఓ గరికపాటి కరుణకుమారి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కే.రాజశేఖర్ అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకాన్ని వారు ప్రారంభించారు.

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న సుదూర ప్రాంత విద్యార్థులకు మధ్యాహ్నభోజనం ఎంతో ఉపయోగకరమని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని శీలంవారిపల్లె జడ్పీహెచ్ఎస్ ప్లస్‌నందు శనివారం డొక్కాసీతమ్మ మధ్యాహ్నభోజన పథకాన్ని ఎంఈఓ రాజాల కొండారెడ్డి ప్రారంభించారు.

సింగరాయకొండ: ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించటానికి మధ్యాహ్న భోజన పథకం దోహదపడుతుందని ఎంపీడీఓ డి.జయమణి అన్నారు. స్థానిక ఏఆర్‌సీఅండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె ప్రారంభించారు. ఎంఈఓలు కత్తి శ్రీనివాసరావు, ఆవుల శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ సౌజన్య,పాల్గొన్నారు.

మర్రిపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీఓ రంగయ్య ప్రారంభించారు. స్థానిక హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

లూయిస్ బ్రెయిలీ ఆదర్శనీయుడు


కనిగిరిలో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికినివాళి


పీసీపల్లి: లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కనిగిరిరూరల్: అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. వికలాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ నారపరెడ్డి ఆర్థిక సౌజన్యంతో విద్యార్థులకు ట్రావెల్ బ్యాగ్‌లు అందజేశారు. వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ్ల మల్లికార్జున రావు కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి దివ్యాంగులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించారు. మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ రావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఐవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక భవిత కేందంలో జరిగిన ఎంఈఓలు డీవీ సుబ్బారావు, వీ నారాయణ రెడ్డి, జి.సంజీవిని బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పీసీపల్లి: స్థానిక గోపవరపువారిపల్లి భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఎంఈఓలు ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మహోన్నత వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అన్నారు. ఉపాధ్యాయుడు డి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఎంపీడీఓ డి.జయమణి తెలిపారు. స్థానిక ఆర్ఎస్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు బచ్చుకోటేశ్వరరావు విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, భవిత సిబ్బంది పి.రామిరెడ్డి, టి. కోటయ్య, శ్రీనివాసులరెడ్డి, పంతగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కథనంతో..కదిలారు..!

సాక్షి ఎఫెక్ట్..


తెరుచుకున్న కంట్రోలర్ రూమ్


మరుగుదొడ్లను శుభ్రపరిచి వాడకంలోనికి తీసుకొని వచ్చిన అధికారులు.

టంగుటూరు: టంగుటూరు బస్టాండ్‌లోని సమస్యలపై 'సమస్యల స్టాండ్' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన అధికారులకు ఎట్టకేలకు కదిలారు. బస్టాండ్లో మూసి ఉన్న కంట్రోల్ పాయింట్‌ను శనివారం తెరిచారు. అలాగే హైవేలపై ప్రయాణించే టూస్టార్ బస్సులు టంగుటూరు బస్టాండ్‌లోకి వచ్చాయి. దుర్గంధంతో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను శుభ్రపరచి వినియోగంలోనికి తీసుకువచ్చారు.